నామినేటెడ్ పదవుల్లో మాలలకు ప్రాధాన్యం కల్పించాలి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన మాల వారియర్స్ నాయకులు



కవాడిగూడ: ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన నామినేటెడ్ పదవుల్లో మాల సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ మంగళవారం మాల వారియర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు జంగా శ్రీనివాస్ నేతృత్వంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరినట్లు తెలిపారు. అనంతరం కవాడిగూడలో జంగా శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నియమించే నామినేటెడ్ పదవుల్లో సామాజిక న్యాయం పాటిస్తూ మాల సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఈ విషయం పట్ల భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 8 లోక్ సభ సీట్లు గెలుపొందినందుకు భట్టి విక్రమార్కకు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా కృషి

లబ్ధిదారునికి లక్ష రూపాయల ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే కాలేరు



అంబర్‌పేట: పేదల వైద్యానికి ప్రభుత్వ పథకాలు అందేలా తనవంతు చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద కాచిగూడకు చెందిన మహ్మద్ హమీత్ ఆలీకి నిమ్స్ ఆసుపత్రిలో వైద్య ఖర్చుల కోసం ముందస్తు మంజూరైన రూ. 1 లక్ష మంజూరు పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చొరవ తీసుకుంటానని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఆపద సమయంలో ఎంతో ఉపయోగం కలుతుందని తెలిపారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: అభివృద్ధి పనులల్లో నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం డివిజన్‌లోని శ్రీనివాసనగర్ కాలనీలో చేపట్టిన డ్రైనేజీ పైపులైన్ పనులను ఆమె పరిశీలించారు. అధికారులు పనులను పర్యవేక్షిస్తూ చేపట్టిన అభివృద్ధి పనులు ఏళ్ల తరబడి స్థానిక ప్రజలకు సౌకర్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని నివారించాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జి.వసుందర, బండారి రమేశ్

చిక్కడపల్లి: కళామంజరి, నవ్య నాటక సమితి సంయుక్త ఆధ్వర్యంలో సంగీత సాహిత్య కళానిధి, గాన కళాపూర్ణ శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్య శతజయంతి కార్యక్రమాన్ని ఈ నెల 15న శనివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంస్థల ప్రతినిధులు బండారి రమేశ్, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, ఎం.లక్ష్మీమానసలు తెలిపారు. మంగళవారం చిక్కడపల్లిలోని నవ్యసాహితి సమితి కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకులు జి.వసుంధర ఆవిష్కరించారు. తెలంగాణ సారస్వత పరిషత్ హాల్లో జరిగే ఈ కార్యక్రమానికి డాక్టర్ కేవీ రమణాచారి, పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వరరావు తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్త నిష్ఠల సుధామ, డాక్టర్ ఇందిరాహేమ, వి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్లో మహిళ బ్యాగు చోరీ

కాచిగూడ: రైల్లో ఓ మహిళా ప్రయాణికురాలి బ్యాగు చోరీ జరిగిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని నాంపల్లి ప్రాంతానికి చెందిన సావిత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 9వ తేదీన ఉజ్జయిని నుంచి నగరానికి అంబేడ్కర్ ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తోంది. రైలు భోపాల్ స్టేషన్లో ఉండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి కిటికీ నుంచి ఆమె చేతిలో ఉన్న బ్యాగును లాక్కుని పారిపోయాడు. అందులో 3 తులాల బంగారు మంగళసూత్రం, సెల్‌ఫోన్ ఉన్నట్లు మంగళవారం బాధితురాలు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం భోపాల్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేసినట్లు ఆయన తెలిపారు.

నాలాలో మహిళ మృతదేహం లభ్యం

కాచిగూడ: నాలాలో ఓ మహిళ మృతదేహం లభ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణానగర్ వద్ద హుస్సేన్‌సాగర్ నాలాలో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మేరకు మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే మృతి చెందిన మహిళ తిలక్‌నగర్ ప్రాంతానికి చెదిన సుజాత (47)గా పోలీసులు గుర్తించారు. ఆమె గత కొంతకాలంగా వెన్నుముక నొప్పితో బాధపడుతుంది. దీంతో ఆమె మానసిక వేదనకు గురవుతుంది. ఈ నెల 7వ తేదీన తన తల్లి జయంతిబాయి ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి అప్పటి నుంచి కనిపించకుండాపోయింది. ఈ క్రమంలో నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి బ్రిడ్జి వద్ద ఆమె నాలాలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి కుమారుడు భార్గవ్‌రావు ఫిర్యాదు మేరకు కాచిగూడ ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమస్యలతో స్వాగతం..!

ప్రభుత్వ పాఠశాలలను వెంటాడుతున్న సమస్యలు

నేటి నుంచి నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న తరుణంలో ముందస్తుగా పాఠశాలలోని దెబ్బతిన్న వాటికి మరమ్మతులు, పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, నీటి ట్యాంకుల శుభ్రత తదితర సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవటంతో విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలలు ఇలా ఉంటే పిల్లలు ఏలా బడికి వస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలను మాత్రం పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కానరాని కనీస సౌకర్యాలు
- పేరుకు పోయిన చెత్త కుప్పలు... అధ్వానంగా టాయిలెట్లు
- నేటి నుంచి పాఠశాల ప్రారంభం
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు





అపరిశుభ్రంగా ఉన్న నీటి ట్యాంక్

కవాడిగూడ: ముషీరాబాద్ మండలంలోని కవాడిగూడ ప్రభుత్వ పాఠశాల పరిస్థితి అధ్వానంగా మారింది. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. స్కూల్ ఎంట్రాన్స్ వద్ద చెత్తా చెదారం విద్యార్థులకు స్వాగతం పలుకుతుంది. పాఠశాలలో ప్రభుత్వ స్కావెంజర్‌లు, అటెండర్లు లేకపోవడంతో పరిసరాలు చెత్తా చెదారం పేరుకు పోయి అధ్వానంగా మారాయి. వంట గది, మరుగుదొడ్ల తలుపులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. తరగతి గదుల పక్కనే భోజనం చేసి పడేసిన పేపర్‌ప్లేట్లు, చెత్తా చెదారంతో అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. నీటి నిల్వ కోసం నిర్మించిన ట్యాంక్‌లో రాళ్ళురప్పలు పేరుకుపోయాయి. అసలే పాముల బెడద ఉన్నందున పాఠశాల ఆవరణ శుభ్రపరచాలని, శిథిలమైన గోడలు, తలుపులకు మరమ్మతులకు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మ్యాథ్స్, సైన్స్ టీచర్లు లేరు...

మొత్తం పాఠశాల విద్యార్థుల సంఖ్య 350 కాగా అందులో బాలురు 168, బాలికలు 179 విద్యార్థులు ఉన్నారు. వీరికి 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మ్యాథ్స్, బయోసైన్స్ బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పాఠశాలలో ఖాళీలు భర్తీ చేస్తే బాగుంటది

మ్యాథ్స్ చెప్పడానికి ఉపాధ్యాయులు ఉన్నా కూడా వారి ఆరోగ్య రిత్యా విద్యార్థులకు పాఠాలు బోధించలేకపోతున్నారు. అదే విధంగా స్కావేంజర్, స్వీపర్‌లు లేకపోవడంతో పాఠశాల ఆవరణ చెత్తాచెదారంతో పేరుకుపోయి అపరిశుభ్రంగా మారుతోంది. ఈ విద్యా సంవత్సరానికి పాఠశాలలో ఖాళీలు భర్తీ అవుతాయని కోరుకుంటున్నాం. – పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి

విద్యాశాఖ అధికారుల తీరు మారడం లేదు



విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీలను భర్తీ చేసి కనీస సౌకర్యాలు కల్పించాలని అనేకసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారిలో మార్పుమాత్రం రావడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్పా ప్రభుత్వ విద్యా వ్యవస్థ తీరు మారడం లేదు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ విద్యా సంస్థల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి. – అశోక్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి



పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తా చెదారం

నేటి నుంచి పాఠశాలల పున:ప్రారంభం

విద్యార్థులకు మొదటి రోజే పుస్తకాల అందజేత

ముషీరాబాద్: విద్యార్థులకు వేసవి సెలవుల అనంతరం 47 రోజుల తరువాత పాఠశాలలు పునప్రారంభం కానున్నాయి. ఇన్ని రోజులు ఆట, పాటల్లో మునిగి తేలిన విద్యార్థులు బుధవారం పుస్తకాలు చేతపట్టి బడులకు హాజరు కానున్నారు. ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని 22 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. అమ్మా ఆదర్శ పథకం కింద పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతి పాఠశాలకు ప్రభుత్వం 40 వేల నిధులను మంజూరు చేసింది. ఆ నిధులతో మంచినీళ్ల, డ్రైనేజీ, వివిధ ప్యాచ్‌వర్క్ నిమిత్తం వెచ్చించారు. పాఠశాల ప్రారంభం అయిన రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేసేందుకు సిద్ధం చేశామని విద్యా మండలి డిఈవో ఈవో చిరంజీవి తెలిపారు.

ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి తెలిపారు. గ్రాండ్ వెల్కం పలుకుతూ విద్యార్థులను పాఠశాలకు తీసుకువస్తున్నామన్నారు. పాఠశాలలు పునప్రారంభం కానుండడంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు. మొదటి రోజు విద్యార్థులకు ఘనంగా బెలూన్‌లు, పూలతో స్వాగతం పలుకుతామన్నారు. మొదటి రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తాం.



సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



గోల్నాకలో ప్రజా సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: మౌలిక సమస్యల పరిష్కారంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. మంగళవారం గోల్నాక డివిజన్‌లో ప్రజా సమస్యలపై ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. కలుషిత నీటి సరఫరా, అంతర్గత రోడ్లు, వీధి లైట్లు వంటి సమస్యలను స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మౌలిక సమస్యలు తలెత్తినప్పుడు తక్షణ పరిష్కారానికి అధికార యంత్రాంగం చొరువ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మురుగుతోనే సావాసం..!

- ఇళ్ల మధ్యనే నిలిచిపోతున్న మురుగునీరు
- సత్యానగర్ కాలనీవాసులు బాధలు వర్ణణాతీతం
- బయటకు వెళ్లలేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



సత్యానగర్ బస్తీలో రోడ్లపై పేరుకుపోయిన మురుగు నీరు

కాచిగూడ: జలమండలి బర్కత్‌పుర సెక్షన్ పరిధిలోని సత్యానగర్ బస్తీలోని ప్రజలు మురుగునీటితో సావాసం చేస్తున్నారు. గత కొద్ది నెలలుగా ఇళ్లమధ్యనే మురుగునీరు నిలిచిఉండటం, కొన్ని చోట్ల ఇళ్లలోకి కూడా మురుగునీరు రావటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సత్యానగర్‌లో అవసరాలకు సరిపడా సామర్థ్యం గల పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడంతో తరచూ మురుగు నీరు పొంగిపొర్లుతోంది. దీంతో బస్తీలో ఎక్కడ చూసినా డ్రైనేజీలు పొంగి మురుగు నీరు రోడ్లపై ఏరులై పారుతోంది. అదే విధంగా మంచినీరు పైపులైనుల్లో కూడా అక్కడక్కడ లీకేజీలు ఉండటంతో తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. డ్రైనేజీలోని నీరు పైపులైన్ల నుంచి పొంగి ఇక్కడి ఇళ్లలోకి చేరుతుండటంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నీటి నిల్వలతో దోమలు, ఈగలు వృద్ధి...

నిత్యం బస్తీలోని రోడ్లపై మురుగునీరు పారుతూనే ఉంది. రోడ్లు మొత్తం మురుగుతో నిండిపోయి నడవడానికి కూడా వీలులేకుండా ఉంటుంది. రోడ్లు గుంతలమయంగా ఉండటంతో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు, క్రిమికీటకాలు వృద్ధి చెంది స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారు. చిన్నపిల్లలు మురుగునీటిలో నుంచే నడుచుకుంటూ వెళ్లడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయే తప్ప పరిష్కారం మాత్రం కావడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పైపులైన్ మంజూరైంది..

సత్యానగర్ బస్తీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం నూతనంగా పైపులైన్ మంజూరైందని జలమండలి బర్కత్‌పుర సెక్షన్ ఏఈ గాజుల భావన తెలిపారు. డ్రైనేజీ నీటిని సత్యానగర్ నుంచి రత్నానగర్ మీదుగా నాలాలో కలుపడానికి త్వరలోనే పైపులైన్ పనులు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. డ్రైనేజీ సమస్య సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

మూడు నెలలైనా పరిష్కారం కాని డ్రైనేజీ సమస్య

గత మూడు నెలల నుంచి బస్తీ ప్రజలందరూ డ్రైనేజీ మురుగునీటితో సహజీవనం చేస్తున్నారు. పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగు ముందుకు వెళ్లడానికి దారిలేకపోవడంతో రోడ్లపైనే నెలల తరబడి నిలిచిపోయి కంపుకొడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్తీలో ఇరుకైన రోడ్లపై మురుగు ఉండటంతో నడిచే దారిలేకుండాపోతోంది. అధికారులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్గంధం భరించలేకున్నాం..



రోడ్లపై నిలిచిపోయిన డ్రైనేజీ మురుగు దుర్గంధం భరించలేకపోతున్నాం. డ్రైనేజీ మురుగునీరు ఇళ్లలోకి వచ్చి చేరుతోంది. ఇళ్లలో ఉండలేక పోతున్నాం. డ్రైనేజీ సమస్య కారణంగా పిల్లలు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. వాంతులు, విరేచనాలు వంటి వ్యాధులతో సతమతమవుతున్నారు. – ప్రేమలత, సత్యానగర్

తాగునీరు కలుషితం..



మురుగునీరు పొంగిపొర్లుతుండటంతో నల్లాల్లోని తాగునీరు కలుషితమవుతోంది. రోడ్లపై మురుగు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. రాత్రివేళల్లో దోమలు నిద్రలేకుండా చేస్తున్నాయి. విషజ్వరాలు ప్రబలుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించాలి. – రేణుక, గృహిణి

ప్రవీణ్‌కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం



రాగుల ప్రవీణ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, పార్టీ నాయకులు

అంబర్‌పేట: బీఆర్ఎస్ పార్టీ క్రియాశీల నాయకుడు రాగుల ప్రవీణ్‌కుమార్ ఆకస్మిక మృతి విచారకరమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఇటీవల మృతి చెందిన రాగుల ప్రవీణ్‌కుమార్ సంస్మరణ మంగళవారం అంబర్‌పేట చెన్నారెడ్డి నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ఆయన హాజరై నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రవీణ్ కూతురు పేరిట రూ. 3 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులను కార్యకర్తలకు తను అండగా ఉంటానని తెలిపారు. ప్రవీణ్ అకాల మరణం పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరనిలోటన్నారు. ఏ ఇబ్బంది వచ్చిన తనను సంప్రదించాలని ఎమ్మెల్యే అతని కుటుంబ సభ్యులకు సూచించి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల సుధాకర్‌రెడ్డి, సిదార్థ ముదిరాజ్, ఎర్రబోటు నర్సింహరెడ్డి, మాజీ కార్పొరేటర్ పులిజగన్, సీపీఎం నాయకులు మహేందర్, బీఆర్ఎస్ నాయకులు లింగం గౌడ్, మధుసూదన్‌రెడ్డి, లింగరావు, రామరావు యాదవ్, ఆర్‌కే బాబు, సురేష్‌గౌడ్, మిర్యాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు

మేనేజ్‌మెంట్ కోటా పేరుతో దోపిడీ

ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో అధిక డొనేషన్లు అరికట్టాలని వినతి



కాచిగూడ: ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీలలో మేనేజ్‌మెంట్ సీట్లకు కళాశాలల యాజమాన్యాలు రూ.2లక్షల నుంచి రూ.10 లక్షల వరకు డొనేషన్లు తీసుకుంటున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేత టి.రాజ్‌కుమార్ ఆరోపించారు. మేనేజ్‌మెంట్ సీట్ల పేరుతో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని ఆయన మంగళవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలు యాజమాన్యం కోటా కింద 30శాతం సీట్లకు విచ్చలవిడిగా డొనేషన్లు తీసుకొని సీట్లు అమ్ముకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి డొనేషన్లపేరుతో చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హత ఉండి కూడా డొనేషన్లు కట్టలేక ఎంతో మంది పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. సీట్లు అమ్ముకోవడం చట్ట విరుద్ధమని, ప్రభుత్వం జోక్యం చేసుకుని మేనేజ్‌మెంట్ సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. లేదా డొనేషన్లు వసూలు చేయకుండా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవు

నల్లకుంటలో స్వచ్ఛ భారత్‌లో కార్పొరేటర్ అమృత



నల్లకుంట రైల్వే ట్రాక్ వద్ద చెత్తను తొలగించి ముగ్గులు వేసిన దృశ్యం

నల్లకుంట: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం నల్లకుంట డివిజన్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ నర్సింహబస్తీ, నల్లకుంట రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాలలో బీజేపీ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వీధులను శుభ్రం చేయించారు. అలాగే చెత్తను తొలగించిన ప్రాంతంలో తిరిగి ఎవరూ చెత్తను వేయరాదని ముగ్గులు వేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇళ్లల్లో పేరుకు పోయిన తడి, పొడి చెత్తను నిర్లక్ష్యంగా వీధుల్లో వేయకుండా ఇంటింటికి వచ్చే స్వచ్ఛ ఆటోల్లో వేయాలని ప్రజలకు సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున వీధులు అపరిశుభ్రంగా ఉంటే ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు భాధ్యతాయుతంగా చెత్తను ఇంటింటి వచ్చే స్వచ్ఛ ఆటోల్లోనే వేసి స్వచ్ఛ భారత్‌కు సహకరించాలని కోరారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వీధుల్లో చెత్తను వేస్తే అలాంటి వారిని గుర్తించి జీహెచ్ఎంసీ అధికారులు జరిమానాలు వేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎస్. నర్సింగ్ రావు, బీజేపీ ఓబీసీ మోర్చా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్. మహేష్ కుమార్, ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి ఎం. మురళి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె. లక్ష్మణ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

నల్లకుంట : ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై క్రిష్ణ తెలిపిన వివరాలు... జీహెచ్ఎంసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న తీగమల్ల యాదయ్య భార్య అనసూర్య, ఇంటర్ రెండో సంవత్సం చదువుతున్న కుమార్తె టి. స్పందన(17), కుమారుడు రిత్విక్ (13)లతో కలిసి అడిక్‌మెట్‌లో నివాసముంటున్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు భార్యాభర్తలు ఇద్దరు ఎవరి విధులకు వారు వెళ్లిపోయారు. సాయంత్రం 6 గంటలకు దంపతులిద్దరు విధుల నుంచి ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో కుమార్తె కనిపించలేదు. ఇంట్లో ఉన్న కుమారుడు రిత్విక్‌ను అడుగగా నాకు తెలియదని చెప్పాడు. తెలిసిన వారు, బంధువులను విచారించినప్పటికి కుమార్తె ఆచూకీ లభించలేదు. దీంతో యాదయ్య నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలసుబ్రహ్మణ్యం పాటలతో మైమరిచిపోతాం



చిక్కడపల్లి: బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన పాటలు వింటే మనకు మనమే మైమరిచిపోతామని, ఆయన తెలుగుతోపాటు పలు బాషాల్లో పాడిన ఎన్నో పాటలు మధురానుభూతిని కలిగిస్తాయని వక్తలు కొనియాడారు. మంగళవారం శ్రీద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్, విజయ్ క్రియేషన్స్ సాంస్కృతిక సేవా సంస్థ 6వ వార్షిక వేడుకల నిర్వహణలో యూకో బ్యాంక్ సౌజన్యంతో ప్రముఖ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాయనీ, గాయకులు శ్రీధర్, సౌమ్య, రమణమూర్తి, సుదర్శన్, కల్యాణి, ప్రసన్న, కృష్ణవేణి, నాగప్రసాద్, కళాపోషకులు లక్ష్మీనరసింహన్, యూకోబ్యాంక్ అధికారులు నాగేశ్వర్‌రావు, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు గోన బుద్ధారెడ్డి



గోన బుద్ధారెడ్డికి నివాళులర్పిస్తున్న కళా జనార్ధనమూర్తి, వి.బాలరాజ్‌గౌడ్‌లు

చిక్కడపల్లి : గోన బుద్ధారెడ్డి కాకతీయ సామ్రాజ్యంలో సామంతరాజుగా ఉంటూ సాహిత్యంపై మక్కువతో రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన మహనీయుడని పొత్తూరి సుబ్బారావు అన్నారు. త్యాగరాయగాన నిర్వహణలో లలితకళా వేదికలో మంగళవారం సాయంత్రం తెలుగుకవి గోన బుద్ధారెడ్డి యాదిలో శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొని గోన బుద్ధారెడ్డికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి విరచిత సంస్కృత రామాయణ మహాకావ్యాన్ని ఎందరో తెలుగులోకి అనువదించారని వాటిల్లో గోన బుద్ధారెడ్డి పద్యకావ్యం తెలుగు భాషా సంపద అన్నారు. కవి చిక్కా రామదాసు మాట్లాడుతూ బుద్ధారెడ్డి సులభశైలిలో రామాయణ రచన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో త్యాగరాయ గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సంఘసేవకుడు వి.బాలరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.